క్లుప్తంగా

ఉచిత ఎంసెట్ కోచింగ్

ఆదోని సెంట్రల్: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష (ఎంసెట్) కోసం ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. ఆదోని మండలంలోని గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు ఈ నెల 17వ తేదీ నుంచి కోచింగ్ ప్రారంభిస్తున్నామన్నారు. ఏప్రిల్ 25వ తేదీ వరకు అంటే దాదాపు 33 రోజులు కోచింగ్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. కోచింగ్ విశ్వ నారాయణ జూనియర్ కళాశాలలో ఉంటుందన్నారు. ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాస్తున్న ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్ 9052166745ను సంప్రదించి పేరు రిజిస్టర్ చేసుకోవాలని కోరారు.

వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

ఆదోని సెంట్రల్: ఎస్సీ కర్రెప్ప వసతి గృహ సంరక్షకుడిపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్షులు లింగప్ప డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనంలో నాణ్యత కొరవడిందన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించడం లేదన్నారు. వార్డెన్, వంటమనిషి కుమ్మక్కై దోచుకొంటున్నారని ఆరోపించారు. విద్యార్థులను విచారిస్తే అప్పుడప్పుడు అన్నంలో పురుగులు వస్తున్నాయని కన్నీరు మున్నీరు అవుతున్నారని తెలిపారు. విద్యార్థుల చేత గోడలకు నీళ్లు పట్టించడం వంటి పనులను చేయిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైన అధికారులు స్పందించి వార్డన్, వంటమనిషిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం



పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తున్న నాయకులు

కౌతాళం: గ్రామాల అభివృద్ధే తమ పార్టీ ధ్యేయమని వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి, కాత్రికి గ్రామ సర్పంచ్ వెంకప్పతాత, ఎంపీటీసీ వసంత అన్నారు. మండల పరిధిలోని కాత్రికి గ్రామంలోని ఎస్సీ కాలనీలో తాగునీటి కష్టాలను తొలగించేందుకు మండల పరిషత్ గ్రాంట్‌తో పొదలకుంట రోడ్డులోని బోరు నుంచి పైప్‌లైన్‌తో పాటు మోటార్ ఏర్పాటుకు ఆదివారం పొదలకుంట ఎంపీటీసీ మారెప్ప, నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. వారు మాట్లాడుతూ కాత్రికి గ్రామంలోని ఎస్సీ కాలనీలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకుని మండల గ్రాంట్ రూ.6లక్షలతో పైప్‌లైన్ నిర్మాణం చేపట్టామన్నారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో గ్రామాల్లో మరింత అభివృద్ధి పనులు చేపడుతామని తెలిపారు. వారి వెంట నాయకులు మారెప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ధర్నా

ఆదోని అర్బన్: రాయచోటిలో హిందువులపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద భారీ నిరసన, ధర్నా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు విశ్వహిందూ పరిషత్ నాయకులు తెలిపారు. ఆదివారం స్థానిక విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బసవన్నగౌడ్, విశేష సంపర్క విభాగం రాష్ట్ర ప్రముఖ్ ప్రతాపరెడ్డి మాట్లాడుతూ రాయచోటిలో వీరభద్రస్వామి దేవస్థానం ఊరేగింపులో ఇస్లాం మతానికి చెందిన వారు ఆడి చేయడాన్ని విశ్వహిందూ పరిషత్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. అలాగే హిందువులపై నిర్దాక్షిణ్యంగా లాఠీచార్జి చేసి అక్రమంగా కేసులు పెట్టిన పోలీసు అధికారుల చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ధర్నాలో పెద్ద ఎత్తున హిందూ ఆధ్యాత్మిక ధార్మిక సామాజిక సేవ కుల సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు తలారి ఆంజనేయులు, నాయకులు వీరన్నరావు, ఏనుగు బాల సత్యనారాయణరెడ్డి, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

రవన్నకు నివాళి

ఆదోని రూరల్: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కేంద్ర కమిటీ సభ్యుడు, రాష్ట్ర కార్యదర్శి రవన్న 9వ వర్ధంతి సభను ఆదోని పట్టణంలో ఆదివారం నిర్వహించారు. డివిజన్ నాయకుడు కామ్రేడ్ ప్రసాద్, జిల్లా కార్యదర్శి కామ్రేడ్ మల్లికార్జున ఆధ్వర్యంలో జరిగిన సభలో ముందుగా రాయల సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ దేశంలో దోపిడీ పీడనలేని సమాజ నిర్మాణం కోసం పనిచేస్తూ ఎన్నో పోరాటాలు చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, రసూల్, వీరంజి, వినయ్, ఈరన్న, సంతోష్, మాదేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

దేవరగట్టులో పూజలు



హొళగుంద: దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి వారి దర్శనం కోసం స్థానికులతో పాటు కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. పూజారులుఐ మాళ మల్లేశ్వర స్వామి మూల విరాట్‌లకు జలాభిషేకం, సుప్రభాత సేవ, బండారార్చన, కుంకుమార్చన, మహామంగళారతి, నైవేద్య సమర్పణ తదితర పూజలు చేపట్టారు.

కరుణచూపే దేవుడు.. బసవేశ్వరుడు

- స్వామివారికి తమలపాకులు నైవేద్యం ప్రత్యేకత
- గ్రామంలో 80 శాతం మంది బసవలే
- నేడు జంపాపురంలో స్వామి రథోత్సవం

కోసిగి: భక్తుల పాలిట కల్పతరువు.. కొలిచిన వారిపై కరుణచూపే దేవుడు బసవేశ్వరస్వామి (నందీశ్వరుడు). కోసిగి మండలం జంపాపురం గ్రామ ప్రజల ఆరాధ్య దైవంగా వెలుగొందుతూ నిత్య పూజలందుకుంటున్నాడు. ప్రతి ఏటా పాల్గుణ మాసం శుద్ధ ఏకాదశి నాడు స్వామి వారి రథోత్సవం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా జంపాపురం గ్రామంలో బసవేశ్వర స్వామి సోమవారం సాయంత్రం రథోత్సవాన్ని వేలాది మంది భక్తుల మధ్య నిర్వహించనున్నారు.

స్వామివారి చరిత్ర

గ్రామ పెద్దలు, పూర్వీకులు తెలిపిన వివరాల మేరకు పూర్వం తమలపాకులకు నిలయమైన రాంపురం తోటలలో ఆకులు (తమలపాకులు) విపరీతంగా పండించేవారు. అయితే ఆకులను నందీశ్వరుడు ప్రతి రోజు రాత్రి వేళల్లో ఇష్టానుసారంగా మేస్తూ ఉండేవాడు. రైతులు ఉదయం వెళ్లి చూసేసరికి మొక్కలకు ఆకులు తగ్గిపోతూ కనిపించాయి. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు రాత్రిల్లో ఆకులను దొంగతనం చేస్తున్నారని ఆందోళన చెంది గ్రామస్తులు చర్చలు జరిపారు. ఒక రోజు రాత్రి గ్రామ ప్రజలతో కలిసి రైతులు ఆకుల తోట వద్ద కాపుకాశారు. యథావిధిగా బసవేశ్వరుడు ఆకులను మేసేందుకు అర్ధరాత్రి తోట లోకి ప్రవేశించాడు. కాపు కాచిన రైతులు, ప్రజలు తోటలో నుంచి వస్తున్న శబ్దాన్ని గ్రహించి చూడగా ఇష్టనుసారంగా మేత మేయడం గమనించారు. వెంటనే నందిపై దాడి చేసేందుకు ప్రయత్నించగా తప్పించుకుని పరుగెత్తింది. రైతులు, ప్రజలు వెంబడించారు. పరుగెత్తే సమయంలో ఒక పెద్ద వాగు అడ్డంగా రాగా నంది ఆప్రాంతం నుంచి ఒక్క సారిగా జంపాపురం గ్రామంలో దూకి శిలగా మారిందని గ్రామస్తులు చెబుతారు. అప్పటి నుంచి రైతులు పండించి తోటల ఆకులు రాలిపోవడం, వాడిపోవడం జరుగుతూ ఉండేది. రైతులు గమనించి తమను క్షమించాలంటూ పండించిన ఆకులు తీసుకొచ్చి స్వామి వారికి సమర్పించి పూజలు చేయసాగారు. ఆతర్వాత రైతులకు కష్టాలు తొలగి ఆకుల తోటకు మంచి దిగుబడిని వచ్చేదని కథనం. నేటికీ ఆ ప్రాంతంలో ఆకుతోట పండిస్తున్నారు. నందీశ్వరుడు జంప్ చేసి శిలగా మారడడంతో ఆ గ్రామానికి జంపాపురం గా పేరు వచ్చిందని కూడా చెబుతున్నారు. ఆనాటి నుంచి ప్రజలు స్వామి వారిని కొలుస్తూ ఇష్ట దైవంగా పూజిస్తారు. అలాగే గ్రామంలో 80శాతం మంది ప్రజలకు 'బసవ' అనే అక్షరాలతో పేర్లు పెట్టుకోవడం విశేషం.





ప్రత్యేక అలంకరణలో బసవేశ్వర స్వామి



ముస్తాబైన స్వామి వారి రథం

రాంపురం నుంచి తెచ్చిన తమలపాకుల సమర్పణ

గ్రామంలో కొలువుతీరిన బసవేశ్వర స్వామి రథోత్సవానికి ముందుగా రాంపురం గ్రామం నుంచి పల్లకీలో ఆకులను తెచ్చి స్వామి వారికి సమర్పించిన తర్వాత రథోత్సవం ఊరేగింపు కొనసాగించడం ఆనవాయితీగా సాగుతోంది. సోమవారం సాయంత్రం పురవీధులు గుండా రథానికి ఊరేగింపు నిర్వహించి యథావిధిగా ఆలయం చెంతకు చేర్చుతారు. వేకువ జామున నుంచి ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో జలాభిషేకం, పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, ఆకుపూజ, ఫల,పుష్పాలు సమర్పించి మహా మంగళ హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేయనున్నారు. రథోత్సవం పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీఐ మంజునాథ్, ఎస్ఐ చంద్రమోహన్‌ల ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బుట్టారేణుక

ఎమ్మిగనూరుటౌన్: ఇటీవల పట్టణంలో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికుడు ఆదెన్న కుటుంబ సభ్యులను ఆదివారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక, పార్టీ నాయకుడు, బుట్టా ఫౌండేషన్ అధినేత బుట్టా శివనీలకంఠ పరామర్శించారు. ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పట్టణంలోని 5వ వార్డుకు చెందిన వీరేష్ కుమార్తె శైలజ ప్రమాదవశాత్తు కింద పడి వెన్నుపూస గాయమవడంతో ఆమె ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు ఎంకే శివప్రసాద్, చంద్ర, నాగేంద్ర, గిరి,ఉమ, శ్రీరాములు, నారాయణ, ఈరన్న, రంగన్న, వీరేష్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యం వల్లే శిశువు మృతి

ఎమ్మిగనూరురూరల్: ప్రభుత్వాసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా అప్పుడే పుట్టిన శిశువు మృతి చెందాడని, శిశువు మృతికి కారకులైన వైద్యులను సస్పెండ్ చేయాలని సామాజిక కార్యకర్త, న్యాయవాది అడ్డాకుల తిమ్మప్ప డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నార్మల్ డెలివరీ అని చెప్పిన వైద్యులు డెలివరీ సమయంలోనే బేబి మృతి చెందితే చెప్పకుండా దాచిపెట్టారని ఆరోపించారు. డెలివరీ సమయంలో ఉన్న వైద్యులపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో అందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

ఆదోని అర్బన్: ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (అవోపా), ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ(వామ్) వారి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయిభారతి స్కూల్‌లో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రముఖ ఎన్నారై కాకుబాళ్ నగేష్ సౌజన్యంతో నంద్యాల శాంతిరామ్ ఆసుపత్రి వారి సహకారంతో ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు అవోపా ప్రెసిడెంట్ వంకదారు శ్రీనాథ్‌గుప్తా తెలిపారు. శిబిరంలో 185 మంది కంటివైద్య పరీక్షలు చేసి, అందులో 68 మందికి ఉచిత కంటి ఆపరేషన్ల కోసం నంద్యాలకు రెఫర్ చేశారన్నారు. అవసరమైన ప్రతిఒక్కరికీ విలువైన కంటి శుక్లాన్ని ఉచితంగా అమర్చి అక్కడ ఆసుపత్రిలో రోగులకు ఉండడానికి కావాల్సిన ఆహార మరియు వసతి సౌకర్యాలను కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆదోని, నంద్యాలకు రానుపోను రవాణా సౌకర్యాన్ని కూడా ఉచితంగా కల్పిస్తున్నట్లు తెలిపారు. ఖరీదైన వైద్యాన్ని దాత ఎన్ఆర్ఐ కాకుబాళ్ నగేష్ ఆధ్వర్యంలో ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆదోని పట్టణ అవోపా మరియు వామ్ కోశాధికారి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు ప్రతాప్, ఈరన్నశెట్టి, సభ్యులు అశ్వత్, వెంకటేష్‌బాబు, రాజేష్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అన్ని వర్గాలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక
- 12న నిర్వహించే యువతపోరు పోస్టర్లను పార్టీ శ్రేణులతో కలిసి ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక, పార్టీ శ్రేణులు

ఎమ్మిగనూరుటౌన్: ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు అమలుకు సాధ్యంకాని హామీలతో నిరుద్యోగులను, యువతను, ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన తరువాత అన్ని వర్గాలను మోసం చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబునాయుడుకే దక్కిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక అన్నారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన నిర్వహించే యువత పోరు పోస్టర్లను స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయ ఆవరణలో పార్టీ శ్రేణులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు నిరుద్యోగులకు రూ.3వేల నిరుద్యోగ భృతి, ఉచిత బస్‌పాస్‌లు, 20లక్షల ఉద్యోగాలు, అంతర్జాతీయ స్థాయిలో విద్యాసంస్థల ఏర్పాటు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ఏర్పాటు లాంటి హామీలు గుప్పించారన్నారు. అధికారంలోకి వచ్చి 9నెలలు గడిచినా నేటికీ వాటిలో ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలను విడుదల చేయకుండా జాప్యం చేస్తూ విద్యార్థులను మభ్యపెడుతున్నారన్నారు. మాజీ సీఎం జగనన్న పాలనలో ఏర్పాటు చేసిన కొత్త మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం నిర్వహించక ప్రైవేటీకరించే కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకొని పేద విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులో తేవాలని డిమాండ్ చేశారు.

నాడు–నేడు పనుల్లో జాప్యం..

నాడు– నేడు పథకం కింద గత ప్రభుత్వం కోట్లాది రూపాయలతో పాఠశాలలు అభివృద్ధి చేస్తే రెండో విడత నాడు– నేడు పనుల్లో కూటమి ప్రభుత్వం జాప్యం చేస్తోందన్నారు. రైతు భరోసా ద్వారా రైతులను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల ఖాతాల్లో రూ.12,609కోట్లు జమ చేసి ఆదుకుంటే కూటమి ప్రభుత్వం రైతులకు ఏటా రూ.20వేలు ఇస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేకపోయిందన్నారు. ఈనెల 12న జిల్లా కలెక్టరేట్‌ల వద్ద నిర్వహించే యువత పోరు కార్యక్రమానికి విద్యార్థులు, యువత, నిరుద్యోగులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టా శివనీలకంఠ, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి విరూపాక్షిరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, జిల్లా అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు శివప్రసాద్, పార్టీ నాయకులు పాల శ్రీనివాసరెడ్డి, కోటకొండ నరసింహులు, బజారి ,శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మాబ్బాష, సయ్యద్‌చాంద్, లతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేపర్ల కుదింపు.. ఒత్తిడి తగ్గింపు



పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

- పదో తరగతి పరీక్షల్లో మార్పులు తీసుకొచ్చిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- 11 పేపర్లు 7కు కుదింపు
- ఈ సంవత్సరం కూడా అదే పద్ధతి కొనసాగింపు
- విద్యార్థుల్లో తగ్గిన మానసిక ఒత్తిడి

ఆదోని సెంట్రల్: పదో తరగతి పరీక్షలు అనగానే విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి సాధారణంగా పెరుగుతుంది. పరీక్షల హడావుడితో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారు. విద్యార్థులలో మానసిక ఒత్తిడిని తగ్గించడానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆరు సబ్జెక్టులకు 11 పేపర్లు ఉంటే వాటిని ఏడు పేపర్లకు కుదించింది. అంతేకాకుండా పరీక్ష పరీక్షకు ఒక రోజు విరామం ప్రకటించడంతో విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి తగ్గి సులువుగా పరీక్షలను రాసేందుకు వీలయ్యింది. గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా పదో తరగతి పబ్లిక్ పరీక్షలను నిర్వహించనున్నారు. విద్యార్థులు ఒత్తిడి తగ్గించుకొని ప్రశాంతంగా పరీక్షలను రాసుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

పరీక్షలు ఇలా ..

ఎన్నో ఏళ్లుగా పదో తరగతి పరీక్షలు ఆరు సబ్జెక్టులకు 11 పేపర్లతో పరీక్షలను నిర్వహించే వారు. అందులో హిందీ మినహా మిగతా సబ్జెక్టులకు 50 మార్కుల చొప్పున రెండు పేపర్లు ఉండేవి. ఒక్కొక్క పరీక్ష ఒక్కో రోజు చొప్పున అలా 11 రోజులు పరీక్షలను నిర్వహించేవారు. దీంతో విద్యార్థులు మానసిక సంఘర్షణకు గురయ్యే వారు. విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేయకూడదని గత ప్రభుత్వం విద్యారంగంలో పలుమార్పులు చేసింది. సబ్జెక్టుకు రెండు పేపర్లను కుదించి ఒకే సారి 100 మార్కులకు పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఇలా తెలుగు, ఇంగ్లిషు, మ్యాథ్స్, సోషల్, హిందీ సబ్జెక్టులను నిర్వహిస్తే. సైన్స్ మాత్రం సైన్స్, బయోలాజీకి మాత్రం పేపరుకు 50 మార్కుల చొప్పున రెండు పరీక్షలను నిర్వహిస్తున్నారు.

మార్చి 17 నుంచి పరీక్షలు..

పదో తరగతి పరీక్షలు మార్చి 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జరగనున్నాయి. పరీక్షలో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేందుకు ప్రణాళికలు అయితే రూపొందించారు కానీ విద్యార్థులకు అవసరమైన మెటీరియల్ మాత్రం పంపిణీ చేయలేదు. పరీక్షలు దగ్గరకు పడుతున్న విద్యార్థులకు పంపిణీ చేయాల్సి మెటీరియల్ ఊసే లేదు. గతంలో నాలుగు రివిజన్ పరీక్షలను నిర్వహించి ప్రీఫైనల్ పరీక్షలను నిర్వహించే వారు. ఈ ఏడాది వంద రోజుల ప్రణాళికల పేరుతో చదివిస్తున్నారే తప్ప రివిజన్ పరీక్షలు లేవు. రెండు సార్లు ప్రీఫైనల్ పరీక్షలను నిర్వహించారే తప్ప విద్యార్థులకు అవసరమైన మెటీరియల్ మాత్రం పంపిణీ చేయలేక పోయారనే విమర్శలు వినబడుతున్నాయి.

పరీక్షలంటే భయం వద్దు



గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు ఏడు పేపర్లు ఉంటాయి. ఒక్కొక్క సబ్జెక్టుకు 100 మార్కులు చొప్పున తెలుగు, ఇంగ్లిషు, హిందీ, మ్యాథ్స్, సోషల్ సబ్జెక్టులకు పరీక్షలు జరుగుతాయి. సైన్స్, బయాలజీకి మాత్రం ఒకోక్క దానికి 50 మార్కులు చొప్పున పరీక్షలు జరుగుతాయి. విద్యార్థులు కూడా గమనించి ప్రతి ప్రశ్నను ఒకటికి రెండు సార్లు చదువుకొని పరీక్షలను రాయాలి. భయపడకుండా పరీక్షలను ప్రశాంతంగా రాయాలి.

– వెంకటరమణారెడ్డి, డిప్యూటీ ఈఓ

రమణీయం.. సుబ్బారూఢ స్వామి మహారథోత్సవం



భక్తుల మధ్య ఊరేగుతున్న స్వామి వారి మహా రథోత్సవం (ఇన్‌సెట్) పూజలందుకుంటున్న గురుసుబ్బారూఢ స్వామి

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని రంగప్ప గట్టు వద్ద వెలసిన గురు సుబ్బారూఢ స్వామి మహా రథోత్సవం ఆదివారం సాయంత్రం భక్తుల మధ్య కనుల పండువగా సాగింది. పాల్గుణ మాసం శుద్ధ దశమిని పురస్కరించుకుని వేకువ జామున నుంచి ఆలయ ధర్మకర్తలు మఠం చంద్రయ్య, బండారి దయా, మణికంఠ స్వామిల ఆధ్వర్యంలో ఆలయంలో కొలువుదీరిన మల్లికార్జున స్వామి, గురుసుబ్బారూఢ స్వామిలకు అభిషేకాలు, ఆకుపూజ, రుద్రాభిషేకం, వెండికవచ అలంకరణలు గావించి మహా మంగళ హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు వందలాదిగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని పూజలు చేసుకున్నారు. ఉదయం ఉత్సవమూర్తిని చిన్న రథంపై కొలువుంచి స్వామి వారి పాదాల వరకు లాగి తిరిగి యథాస్థానానికి చేర్చారు. సాయంత్రం మల్లయ్య స్వామి పల్లకోత్సవాన్ని మేళ తాళాలు, కలశాలు, డప్పువాయిద్యాలతో ఆలయం నుంచి పెండేకల్లు పొలాల్లో వెలసిన ఆంజనేయ స్వామి దేవాలయం వరకు ఊరేగింపుగా వెళ్లి తిరిగి ఆలయం చెంతకు చేరుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు మేళతాళాలు పూర్ణకుంభంతో మహా రథం వద్దకు చేరుకుని పూజలు చేసి మహారథోత్సవాన్ని ప్రారంభించారు. స్వామి పాదాల చెంతకు మహా రథాన్ని లాగి తిరిగి యథాస్థానంలో చేర్చారు. గోపరాక్..గోపరాక్ అంటూ గొరవయ్యల నృత్యాల నడుమ రథోత్సవం ముందుకు సాగింది. ఉదయం వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై స్వామి వారి దర్శించుకుని పూజలు చేసుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకుడు నాడుగేని నరసింహులు, ఎంపీపీ ఈరన్న, మండల కన్వీనర్ బెట్టన గౌడ, నాడుగేని నాగరాజు, బుల్లి నరసింహులు తదితరులు పాల్గొన్నారు. రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్ఐ చంద్రమోహన్, ఏఎస్ఐ నాగరాజు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాత్రిల్లో భక్తభజన పాటలతో అలరించారు.



చిన్న రథాన్ని లాగుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు



గొరవయ్యల మధ్య మల్లయ్య స్వామి పల్లకోత్సవం



పూర్ణకుంభాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న ఆలయ కమిటీ బృందం

కౌన్సిలర్ రామలక్ష్మమ్మ మృతి



మృతురాలు రామలక్ష్మమ్మ (ఫైల్)

ఆదోని టౌన్: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకురాలు, 23వ వార్డు కౌన్సిలర్ రామలక్ష్మమ్మ(56) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ గౌరవా ధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి, కౌన్సిలర్ రామలింగేశ్వర యాదవ్ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు కుటుంబ సభ్యులతో మాట్లాడారు. పార్టీ అండగా ఉంటుందని, ధైర్యంగా ఉండాలన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ..రామలక్ష్మమ్మ మృతి బాధాకరమని, ఆమె మృతి పార్టీకి తీరనిలోటన్నారు. ఆమె వార్డు ప్రజలకు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అదే విధంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆమె పట్ల సంతాపం తెలియజేశారు. మున్సిపల్ కౌన్సిలర్ ఫయాజ్‌అహ్మద్ తదితరులు ఉన్నారు.



వార్డు కౌన్సిలర్ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీటీ నాయుడు

కర్నూలు(అగ్రికల్చర్): ఆదోని నియోజకవర్గానికి చెందిన బీటీ నాయుడును ఎమ్మెల్యే కోటా కింద ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటిస్తూ టీడీడీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. టీడీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన బీటీ నాయుడు ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేయడం పట్ల టీడీపీ వర్గాల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

వర్గీకరణ పేరుతో విభజిస్తున్న ప్రభుత్వం

హొళగుంద: అన్నదమ్ములుగ కలిసి ఉన్న మాల, మాదిగలను కూటమి ప్రభుత్వం వర్గీకరణ పేరుతో విభజించి పాలించు అనే విధానాన్ని అవలంభిస్తుందని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహానంది, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సాయిరాం అన్నారు. ఆదివారం లింగంపల్లి గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ బోర్డు ఏర్పాటు చేసి జైభీమ్ జెండాను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం రద్దు చేసిన 23 ఎస్సీ సంక్షేమ పథకాలను అధికారంలోకి వస్తే అమలు చేస్తామని చెప్పి నేడు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. మల్లికార్జున, వెంకటరాముడు, భరత్, కేశవ్ మాస్టర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.